రసవత్తర రాజకీయం

# పీజేఆర్ వారసులకు రేవంత్ చెక్

- అన్నా, చెల్లెకు వ్యతిరేకంగా పావులు కదుపుతున్న టీపీసీసీ అధ్యక్షుడు
- జూబ్లీహిల్స్‌లో విష్ణుకు వ్యతిరేకంగా రేసులోకి అజారుద్దీన్
- పీజేఆర్ తనయుడికి అండగా నిలుస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్లు
- ఖైరతాబాద్‌లోనూ రోహిణ్‌రెడ్డికే అనుకూల సర్వేకు రేవంత్ కుట్రలు

పీజేఆర్.. గ్రేటర్ హైదరాబాద్‌లో ఈ మూడు అక్షరాలంటే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎంతో అభిమానం. అంతేకాదు.. తెలంగాణవాదిగానూ పీజేఆర్ అంటే రాష్ట్రంలో అభిమానించే వారి సంఖ్యకు తక్కువేమీ లేదు. రాజకీయ ప్రస్థానం ఆరంభించింది మొదలు.. ఎన్ని కష్టాలు ఎదురైనా.! సొంత పార్టీ ముఖ్యమంత్రి స్వయంగా టార్గెట్ చేసినా!! వెరవని... కాంగ్రెస్ జెండాను విడవని నాయకుడు పీజేఆర్. అలాంటి నాయకుడి వారసులకు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయి. వాళ్లూ.. వీళ్లూ కాదు.. ఏకంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పీజేఆర్ వారసులకు చెక్ పెట్టేందుకు తెర వెనుక పావులు కదుపుతున్నాడనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. గత కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలు సైతం ఈ ప్రచారానికి బలాన్ని చేకూరుస్తున్నాయి. జూబ్లీహిల్స్‌లో పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి.. ఖైరతాబాద్‌లో ఆయన కుమార్తె విజయారెడ్డికి టికెట్ రాకుండా రేవంత్ చెక్ పెడుతున్నట్లు స్పష్టమవుతోంది. దీంతో 'ముందొచ్చిన చెవుల కంటే... వెనకొచ్చిన కొమ్ములు వాడి' అన్నట్లుగా తయారైంది పరిస్థితి అని కాంగ్రెస్ నాయకులే పెదవి విరుస్తున్నారు.

*–సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ):*

ఉమ్మడి రాష్ట్రంలో 2009 వరకు దేశంలోనే అతి పెద్ద శాసనసభ నియోజకవర్గంగా వెలుగొందిన ఖైరతాబాద్ నియోజకవర్గమంటేనే పి.జనార్దన్‌రెడ్డి (పీజేఆర్) పేరు గుర్తొస్తుంది. 2007లో పీజేఆర్ గుండెపోటుతో అకస్మాత్తుగా చనిపోవడంతో.. అనంతరం జరిగిన ఉప ఎన్నికలో ఆయన కుమారుడు పి.విష్ణువర్ధన్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2009 సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన జరగడంతో విష్ణువర్ధన్‌రెడ్డి ఖైరతాబాద్‌లో భాగంగా ఏర్పడిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, గెలుపొందారు. ఇక.. 2014, 2018 ఎన్నికల్లో అదే జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విష్ణువర్ధన్‌రెడ్డి ఓటమి చెందారు. ఈ నేపథ్యంలో తాజా శాసనసభ ఎన్నికలకు జూబ్లీహిల్స్ నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు తన అనుచరులు, పార్టీ శ్రేణుల్ని సమాయత్తం కూడా చేసుకున్నారు. కానీ, అనూహ్యంగా జూబ్లీహిల్స్ తెరపైకి మాజీ క్రికెటర్ అజారుద్దీన్ వచ్చారు. ఎకాఎకిన నియోజకవర్గంలో పర్యటించి.. కాంగ్రెస్ పార్టీ టికెట్ తనకే వస్తుందంటూ ప్రచారం చేసుకున్నారు. దీంతో అప్రమత్తమైన విష్ణువర్ధన్‌రెడ్డి వర్గీయులు అజారుద్దీన్ పర్యటనను అడ్డుకున్నారు. అయితే, హస్తినలో కాంగ్రెస్ పెద్దల ఆశీర్వాదం తనకున్నదని అజారుద్దీన్ చెప్పుకుంటున్నప్పటికీ... ఇక్కడ తెర వెనుక టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డినే అజారుద్దీన్‌ను ప్రోత్సహిస్తున్నట్లుగా పార్టీవర్గాలే చెబుతున్నాయి. విష్ణు, ఆయన వర్గీయులు కూడా ఇదే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి విష్ణువర్ధన్‌రెడ్డి ఆయనను



కలిసిన సందర్భం లేదు. పైగా గతంలో కోమటిరెడ్డి వర్సెస్ రేవంత్ ఎపిసోడ్‌లో మొదటి నుంచి పార్టీలో ఉన్న వారిని రేవంత్ హోంగార్డుల పోల్చినప్పుడు పెద్ద దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంలో విష్ణువర్ధన్‌రెడ్డి, కోమటిరెడ్డికి మద్దతుగా నిలిచి.. మేం హోంగార్డులమే, మాతో ఏం పని? అని కూడా ప్రశ్నించారు. దీంతో అప్పటి నుంచి రేవంత్, విష్ణు మధ్య పెద్ద సత్సంబంధాలేమీ లేవు. అందుకే రేవంత్ జూబ్లీహిల్స్ నుంచి అజారుద్దీన్‌కు గ్రీన్ సిగ్నల్ వచ్చేలా పావులు కదుపుతున్నాడనే ప్రచారం జరుగుతోంది.

## ఖైరతాబాద్‌లోనూ పీజేఆర్ వారసురాలికి వ్యతిరేకంగా...

పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి ఖైరతాబాద్ నియోజకవర్గాన్ని నమ్ముకుని ఉన్నారు. ఈమె గతంలో బీఆర్ఎస్‌లో ఉండి, కార్పొరేటర్‌గా గెలుపొందినప్పటికీ కొంతకాలం కిందట కాంగ్రెస్‌లోకి వెళ్లింది. ఆమె కాంగ్రెస్‌లోకి వెళ్లడం వెనక కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రోత్సాహం ఉన్నట్లుగా తెలిసింది. దీంతో ఇక్కడ కూడా రేవంత్ తన అనుచరుడు రోహిణ్‌రెడ్డికి అనుకూలంగా పావులు కదుపుతున్నారు. ముఖ్యంగా.. రోహిణ్‌రెడ్డి అయితేనే ఖైరతాబాద్‌లో కాంగ్రెస్ గెలుస్తుందనే రీతిలో సర్వేలు చేయిస్తున్నాడనే ప్రచారం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 నియోజకవర్గాల్లో రేవంత్ తాను అనుకున్న వారికి అనుకూలంగా సర్వేలు చేయించి, అధిష్ఠానానికి పంపినట్లుగా తెలుస్తున్నది. అందులో ఖైరతాబాద్ నియోజకవర్గం కూడా ఉండగా.. విజయారెడ్డికి వ్యతిరేకంగా రోహిణ్‌రెడ్డిని రేవంత్ ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఇక్కడ కూడా పీజేఆర్ వారసురాలికి రేవంత్ చెక్ పెడుతున్నారు. మరోవైపు ఉదయపూర్ తీర్మానం మేరకు కుటుంబంలో ఒక్కరికే టికెట్ అన్న ప్రస్తావనను కూడా విష్ణు, విజయారెడ్డి విషయంలో వాడుతున్న రేవంత్.. చివరకు ఇద్దరికీ చెక్ పెట్టేలా ప్రయత్నిస్తున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

*మంత్రి చామకూర మల్లారెడ్డి* • *30 మంది బీఆర్ఎస్‌లో చేరిక*



బీఆర్ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలకు పార్టీ కండువాకప్పి ఆహ్వానిస్తున్న మంత్రి మల్లారెడ్డి

శామీర్‌పేట, అక్టోబర్ 2 : బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మూడు చింతలపల్లి మండలం కొల్తూర్ గ్రామానికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలు సోమవారం అలియాబాద్‌లోని సీఎంఆర్ కన్వెన్షన్‌లో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు మొదలయ్యాయన్నారు.

### పార్టీలో చేరిన వారు వీరే..

కొల్తూర్ గ్రామానికి చెందిన గుర్రాల జహంగీర్, కాసుల రాజు, కొండ ప్రవీణ్, కొండ శివ, కొండ శ్రీధర్, దుర్గం చందు, కౌకూర్ అజయ్, కొండ ప్రసాద్, సలీంద్రి శ్రీను, ప్రవీణ్, హరికృష్ణ, పవన్, గణేశ్, ఉదయ్‌కిరణ్, సత్యనారాయణ, నవీన్, వినయ్, ఓంకార్, బాబు, ప్రసాద్, నవీన్, రవి.. తదితరులు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరగా.. మంత్రి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు.

## కండ్లముందే కనబడుతున్న అభివృద్ధి

*ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు*



ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న బీజేపీ, కాంగ్రెస్ మహిళా నేతలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 2 : తొమ్మిదిన్నరేండ్లలో జరిగిన అభివృద్ధి ప్రజలకు కండ్లముందు కనబడుతున్నదని, పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సీఎం కేసీఆర్ పాలనకు ఆకర్షితులై బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మహిళా నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే కృష్ణారావు సమక్షంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 20 మంది మహిళా నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, ప్రజలందరూ గుర్తిస్తున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన మహిళా నేతలు బీఆర్ఎస్ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కో ఆర్డినేటర్ సతీశ్ అరోరా, పాతూరి గోపి, మహిళా నేతలున్నారు.

# అభివృద్ధే 'తారక' మంత్రం.!



- పనిచేశాం.. ఆశీర్వదించండి.. అంటూ ఎమ్మెల్యేల పాదయాత్రలు
- ప్రచారంలో దూకుడు పెంచేలా ప్రణాళికలు
- ఇక హైదరాబాద్ అభివృద్ధి ప్రదాత కేటీఆర్‌తో సభలకు ప్లాన్
- ప్రగతి నివేదన సభలు నిర్వహించనున్న అభ్యర్థులు
- ఈ నెల 5 నుంచి నగరంలో మంత్రి కేటీఆర్ సభలు

సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): టికెట్ వస్తుందో.? రాదో తెలియని అయోమయ పరిస్థితి ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లో ఉంటే.. అధికార పార్టీలో మాత్రం గడిచిన నెలన్నర రోజులకు పైగా అభ్యర్థులంతా నిత్యం ప్రజలతో మమేకమై పనిచేస్తున్నారు. ఒకవైపు పాదయాత్రలు, ఆత్మీయ సమావేశాలు, మరోవైపు సంక్షేమ ఫలాలను అర్హులకు అందజేస్తూ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దూసుకుపోతున్నారు. బీసీ కులవృత్తులతో పాటు మైనార్టీలకు రూ. లక్ష సాయం, గృహలక్ష్మి అర్హుల ఎంపిక, డబుల్ బెడ్‌రూం ఇండ్ల పంపిణీ, దివ్యాంగుల పింఛన్ , దళిత బంధు వంటి అనేక ప్రభుత్వ పథకాలతో క్షేత్రస్థాయిలో అలుపెరగకుండా పర్యటిస్తుండటంతో ప్రతిపక్ష పార్టీల నేతలు ఠారెత్తిపోతున్నారు. వివిధ పార్టీల నుంచి రోజుకో చోట భారీగా బీఆర్ఎస్‌లోకి చేరికలు కొనసాగుతుండటంతో పార్టీ క్యాడర్ జోష్ మీదున్నది. ఈ నేపథ్యంలోనే పాదయాత్రలు ముగిసిన నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ప్రగతి నివేదన సభలు నిర్వహించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. పనిచేశాం.. ఆశీర్వదించండి.. అంటూ ప్రజలకు చేరవైన ఎమ్మెల్యేలు.. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అస్త్రాన్ని తెరపైకి తీసుకువస్తున్నారు.

### ప్రగతి నివేదన సభలు..

హైదరాబాద్ అభివృద్ధి అంటే తారక రామారావు అనేది ప్రజల్లో బలంగా నాటుకుపోయింది. కేటీఆర్‌ను తమ నియోజకవర్గానికి తీసుకువచ్చి ఆయన నోట అభివృద్ధిని వివరించడంతో ప్రజల్లో మరింత ఆదరణ చూరగొనాలని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాదవరం కృష్ణారావు ప్రగతి నివేదన సభను నిర్వహించ తలపెట్టారు. ఈ సభకు మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును ఆహ్వానించి నియోజకవర్గంలో ప్రత్యర్థి పార్టీలకు చుక్కలు చూపించాలని భావిస్తున్నారు. ఇప్పటికే సనత్‌నగర్, ఎల్బీనగర్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో మంత్రి కేటీఆర్ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంతో అటు క్యాడర్‌లో జోష్, ఇటు ప్రజల్లో అభివృద్ధిపై విస్తృత చర్చ జరుగుతోంది. మరికొందరు ఎమ్మెల్యేలు సైతం ప్రగతి నివేదన సభ ద్వారా నియోజకవర్గంలో పదేండ్ల తెలంగాణ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ ప్రగతిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేలా ప్లాన్ చేసుకుంటున్నారు.

### ప్రతి ఇంటికీ సంక్షేమ పథకం

గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ఆదర్శంగా నిలిచింది. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు పింఛన్‌తో 'ఆసరా'గా నిలిచింది. ఆడపడుచులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌తో చేయూతనందించింది. రైతుబంధు, రైతుబీమాతో అన్నదాతకు ఆత్మబంధువై నిలిచింది. మాతా శిశు సంరక్షణకు కేసీఆర్ కిట్లను ప్రవేశపెట్టింది. యాదవులకు గొర్రెల పంపిణీ, రజకులు, మత్స్యకారులు, నాయీ బ్రాహ్మణులకు.. ఇలా సబ్బండ వర్ణాలకు బాసటగా నిలిచింది. గతంలో ఎన్నడూ లేని విధంగా కోట్లాది రూపాయలు ఖర్చు చేసి, ఏదో రూపంలో ఇంటింటికీ లబ్ధి చేకూర్చింది. ఏ రకంగా చూసుకున్నా.. ప్రతి కుటుంబానికీ ఒకటి నుంచి రెండు పథకాలు వర్తించాయి. సంక్షేమ పథకాల లబ్ధిదారులంతా అభ్యర్థులను నిండు మనస్సుతో దీవిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పేదల పక్షాన బీఆర్ఎస్ అండగా నిలబడుతున్నదని కొనియాడుతున్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో సంతోషంగా ఉన్నామంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఆశీర్వదిస్తున్నారు. ఆర్థిక స్థోమతలేక బడుగు బలహీన వర్గాల సమున్నత అభివృద్ధి కోసం, వారి జీవితాల్లో వెలుగు నింపేందుకు కృతనిశ్చయంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ముందుకుసాగుతున్న తీరుపై వృద్ధులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే అభ్యర్థులకు వస్తున్న ఈ అపూర్వ స్పందనను చూస్తే భారీ మెజార్టీతో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలుస్తారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

## ఉజ్బెకిస్తాన్ విశ్వవిద్యాలయ కార్యాలయం ప్రారంభం



ఉజ్బెకిస్తాన్ విశ్వవిద్యాలయం శాఖ కార్యాలయాన్ని సోమాజిగూడలో సోమవారం ప్రారంభిస్తున్న ఉజ్బెకిస్తాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ భారతీయ ప్రతినిధి, నియో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ దివ్యారాజ్‌రెడ్డి, విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎస్‌డీ తేషేవ్, అంతర్జాతీయ వ్యవహారాల అధిపతి డాక్టర్ ఎలేనా ఎ కరిబోవా తదితరులు..

– ఖైరతాబాద్, అక్టోబర్ 2